epaper.telanganavaradhi.com

# తెలంగాణ వారధి

సమగ్ర తెలుగు దినపత్రిక

బుధవారం, 22 అక్టోబర్ 2025

పేజీలు : 4



## రాజకీయ రణక్షేత్రంలో అక్షర సేనాని

- అక్షరమే ఆయుధంగా మందపురం సతీష్

3లో



## పోలీస్ అంటే ఓ భరోసా..

- కర్తవ్య దీక్షలో ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరులకు సీఎం నివాళి
- యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌లో పిల్లలకు నాణ్యమైన విద్య

'పోలీసు అమరవీరుల సంస్మరణ దినం' సందర్భంగా నిర్వహించిన పోలీస్ ఫ్లాగ్ డే వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొని అమరులకు నివాళులర్పించారు. విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసు అమరుల కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రభుత్వ సానుభూతిని వ్యక్తం చేశారు.

2



## టీపీసీసీ చీఫ్‌తో ఝాన్సీరెడ్డి భేటీ

- రాష్ట్ర రాజకీయాలపై చర్చ
- పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్న మహేశ్‌కుమార్ గౌడ్

4




## రైతు కళ్లలో ఆనందమే ప్రభుత్వ లక్ష్యం

- పథకాలను సద్వినియోగం చేసుకోవాలి
- ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

4

తెలంగాణ వారధి
సమగ్ర తెలుగు దినపత్రిక





# పోలీస్ అంటే ఓ భరోసా..

- కర్తవ్య దీక్షలో ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరులకు సీఎం నివాళి
- యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌లో పిల్లలకు నాణ్యమైన విద్య

**హైదరాబాద్, అక్టోబర్ 21 (తెలంగాణ వారధి) :** వామపక్ష తీవ్రవాద ఉద్యమాల్లో ఉన్న అజ్ఞాత నాయకులు సాయుధ మార్గం విడిచి ప్రజల జీవన స్రవంతిలో కలసి దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. చట్టాన్ని గౌరవించే పౌరుల కోసం మాత్రమే 'ఫ్రెండ్లీ పోలీసింగ్' ఉద్దేశమని, చట్టాన్ని ఉల్లంఘించే వారికి గానీ, దానిని సవాలు చేసే వారికి గానీ సానుభూతి ఉండదని స్పష్టం చేశారు.గోషామహల్ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో 'పోలీసు అమరవీరుల సంస్మరణ దినం' సందర్భంగా నిర్వహించిన పోలీస్ ఫ్లాగ్ డే వేడుకల్లో సీఎం పాల్గొని అమరుల జ్ఞాపకార్థం పుష్పాంజలి ఘటించారు. విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసుఅమరుల కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రభుత్వ సానుభూతిని వ్యక్తం చేశారు.ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "పోలీసు అంటే సమాజానికి భరోసా, నమ్మకం. విధి నిర్వహణలో ఎంత ప్రమాదమున్నా ప్రజల రక్షణ కోసం తన ప్రాణాన్నే పణంగా పెట్టే వృత్తి ఇది. సమాజ శ్రేయస్సే ఊపిరిగా పనిచేసే పోలీసుల రుణం ఏమిచ్చినా తీరదు" అన్నారు.ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ చర్యల వివరాలను వెల్లడిస్తూ ఆయన చెప్పారు. అధికారంలోకి వచ్చిన తర్వాత 16 వేలకుపైగా కానిస్టేబుల్స్, ఎస్ఐలను రిక్రూట్ చేశామని,విధి నిర్వహణలో వీరమరణం పొందిన పోలీసు కుటుంబాలకు ఉద్యోగం, ఇంటి స్థలం, పిల్లలకు విద్య, వైద్యం, బస్ పాస్ మొదలైన సౌకర్యాలు కల్పిస్తున్నామని, ఎక్స్ గ్రేషియా మొత్తాలను దేశంలో ఎక్కడా లేని స్థాయిలో పెంచామని పేర్కొన్నారు.ఇటీవల వీరమరణం పొందిన నిజామాబాద్ సీసీఎస్ కానిస్టేబుల్ ఎంపల్లి ప్రమోద్ కుమార్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, ఒక కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా, ప్రభుత్వ ఉద్యోగం, 300 గజాల స్థలం, అదనంగా పోలీస్ భద్రత సొసైటీ, సంక్షేమ నిధుల నుండి మరిన్ని నష్టపరిహారాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. మహిళా ఐపీఎస్ అధికారుల నాయకత్వంలో తెలంగాణ పోలీస్ వ్యవస్థ గర్వకారణమని సీఎం అన్నారు. పోలీస్ శాఖకు ఇండియా జస్టిస్ రిపోర్ట్ 2025లో దేశంలోనే ప్రథమ స్థానం రావడం తమ సిబ్బంది అంకితభావానికి ప్రతీక అని అభినందించారు.మంచిరేవులలో పోలీసు పిల్లల కోసం ప్రారంభించిన 'యంగ్ ఇండియా పోలీస్ స్కూల్' ద్వారా ఉన్నత ప్రమాణాల విద్య అందించాలనే లక్ష్యం ప్రభుత్వం ముమ్మరం చేస్తోందని తెలిపారు.ఇకపై కూడా తెలంగాణ పోలీస్ శాఖ పారదర్శకత, నైతిక విలువలు, సమాజానికి దగ్గరగా ఉండే పోలీసింగ్ విధానాలను కొనసాగిస్తూ దేశంలోనే అగ్రస్థానంలో నిలవాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.కార్యక్రమంలో రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి 'అమరులువారు' పుస్తకాన్ని ఆవిష్కరించారు.



## మౌనంగా కరిగే మన భరోసా

# పోలీస్..!

**పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా దేశానికి ఒక ప్రతిజ్ఞ**

## కన్నీటి అక్షరం.. 'సలామ్ పోలీస్'



**పోలీస్ .. కేవలం ఒక శాఖ కాదు. అది ప్రజల గుండెలపై చెరగని భరోసా సంతకం! ఎండైనా, వానైనా... తుఫానైనా, విపత్తైనా.. మన ఇంట్లో దీపం కొండెక్కినా, మన కంటికి నిదుర కరువైనా.. వీధిలో నిలబడి, చీకటిని చీల్చుకుని, శాంతి కిరణాన్ని ప్రసరించే కనిపించే భగవంతుడి రూపం మీరు. సామాన్యుడి కష్టం... మీకు అసాధారణ కర్తవ్యం! ప్రతి పౌరుడి భద్రతను తమ ప్రాణాల కంటే మిన్నగా భావించే నిస్వార్థ జవాన్ మీరు. ఆపద వస్తే... ఆకాశం వైపు దండం పెట్టినా, రక్షణ కోసం మన అడుగులు పరుగులు తీసేది పోలీస్ స్టేషన్ వైపే! పోలీస్ అంటే... నాలుగవ సింహం అని మనమిచ్చిన బిరుదు మాత్రమే కాదు. నిరంతరం ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకునే, ధైర్యసాహసాల ప్రతిరూపం మీరు! మా ప్రియమైన పోలీస్ అధికారులు, సిబ్బందికి.. మా శిరస్సు వంచి హృదయపూర్వక వందనాలు, సెల్యూట్..!**



**పోలీస్...** ఈ రెండు అక్షరాలు కేవలం పదాలు కావు. అవి రక్షణ, ధైర్యం, నిబద్ధత అనే మూడు శిలలపై చెక్కిన మహోన్నత శిల్పం.సగటు మనిషి జీవితంలో ప్రశాంతత పరుచుకోవాలంటే, ఆ ప్రశాంతత వెనుక నిలబడిన ఒక నిత్య జాగరణ ఉంటుంది. అదే మన పోలీస్ వ్యవస్థ! ఎప్పుడైనా ఆలోచించారా? పండుగ రోజుల్లో మనం ఇంట్లో దీపాలు పెట్టుకుని, నవ్వుతూ ఉన్నప్పుడు... ఆ నవ్వుల భద్రత కోసం తమ కుటుంబానికి దూరంగా, కళ్లలో నిద్రను బంధించుకుని కాపలా కాసేది ఎవరో? చీకటిని కూడా ధైర్యంగా నిలదీసే ఖాకీ చొక్కా ధరించిన మన అన్నదమ్ములే!

ఆపద వచ్చి, గొంతులో మాట రాక, గుండె ఆగిపోయినంత పనైనప్పుడు... మన నోటి వెంట వచ్చే మొదటి పిలుపు, మన సహాయార్థం పరుగున వచ్చే మొదటి వ్యక్తి... పోలీస్! అందుకే, వారు మనకు కేవలం చట్టాన్ని అమలు చేసేవారే కాదు. కష్టంలో తోడుండే కనిపించే దేవుళ్లు! ఈ సమాజంలో చాలా మందిని విమర్శిస్తాం, అపార్థం చేసుకుంటాం. కానీ, ఎప్పుడు తుపాకీ గురిపెట్టినా, ఎప్పుడు బాంబు విసిరినా... ప్రాణాలకు ఎదురు వెళ్లి, గుండెలకు అడ్డుగా నిలిచే అకుంఠిత దీక్ష ఎవరిదో ఒక్కసారి తలచుకోండి.

### అమరత్వంలో అద్వితీయం..

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం. రోజున మనం గుర్తుచేసుకునే ప్రతి వీరుడూ... ప్రతిజ్ఞ చేసి ప్రాణం అర్పించిన పవిత్ర ఆత్మ. నక్సలిజం, ఉగ్రవాదం, ఫ్యాక్షనిజం, మత ఘర్షణలు... ఇలా ఎన్నో సవాళ్లలో తలదూర్చి, నెత్తురు చిందించి, చివరికి విధి నిర్వహణలోనే కనుమూసిన ఆ ధీరుల త్యాగాన్ని మాటల్లో వర్ణించలేం. వారిలో ఒక తండ్రి ఉంటాడు, ఒక కొడుకు ఉంటాడు, ఒక భర్త ఉంటాడు, ఒక కూతురు ఉంటుంది. వారు తమ కుటుంబ కలలను దేశం కోసం వదులుకున్నారు. వారి స్థానంలో నిలిచి, వారి బలిదానాన్ని గుర్తు చేసుకుని, వెక్కి వెక్కి ఏడ్చే ఆ అమరవీరుల కుటుంబాలకు ఈ దేశం ఎప్పటికీ రుణపడి ఉంటుంది. ఆ కుటుంబాల కళ్లల్లోని కన్నీటి ప్రతిబింబమే, మన అందరి హృదయాల్లో రగిలే కృతజ్ఞత అగ్ని.

పోలీస్ వ్యవస్థపై మనకుండే నమ్మకాన్ని, భరోసాను. ఈ అమర వీరుల త్యాగమే శాశ్వతంగా నిలబెట్టింది. వారికి సెల్యూట్! వారి త్యాగానికి జోహార్! మానవత్వాన్ని మించిన ధైర్యంతో, ప్రజా సంక్షేమం కోసం ప్రాణాలను అర్పించిన పోలీస్ వీరులందరికీ... కడదాకా మరువలేని కన్నీటి నివాళులు.

epaper.telanganavaradhi.com

తెలంగాణ వారధి

సమగ్ర తెలుగు దినపత్రిక



## ఎస్ఎస్సి సర్టిఫికెట్ దిద్దుబాట్లపై
# కొత్త మార్గదర్శకాలు

**హైదరాబాద్, అక్టోబర్ 21 (తెలంగాణ వారధి ):** పాఠశాల విద్యా శాఖ ఎస్ఎస్సి మార్కుల మెమోలో పేరు, జన్మతేది, తల్లిదండ్రుల పేర్ల దిద్దుబాటుకు కొత్త ఆదేశాలు జారీ చేసింది. ఇకపై సవరణలు సరైన ఆధారాలతోనే అనుమతించనున్నారు. ప్రిన్సిపల్, క్లర్క్ నుంచి నోటరైజ్డ్ అఫిడవిట్‌లు తప్పనిసరి. జనన సర్టిఫికేట్ పరీక్షల ముందు లేదా తర్వాత జారీ అయ్యిందో స్పష్టంగా ఉండాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. అన్ని డి ఈ ఓ లు, డి వై.ఈఓ లు, ఎం ఈ ఓ లు, హెడ్‌మాస్టర్లు వెంటనే అమలు చేయాలని సూచించారు.

---



## సోమేశ్వర లక్ష్మినరసింహుల
# దివ్యోత్సవాలు ప్రారంభం

**జనగామ, అక్టోబర్ 21(తెలంగాణ వారధి ) :**జనగామ జిల్లా పాలకుర్తి మండలం లో హరిహరుల పుణ్యక్షేత్రమైన పాలకుర్తి ఈ మాసం భక్తి తరంగాలతో నిండిపోయింది. కొండపై స్వయంభువ లింగరూపంగా వెలసిన శ్రీ సోమేశ్వరుడూ, విష్ణు స్వరూపమైన శ్రీ లక్ష్మీనరసింహస్వామివారూ కలిసి భక్తులకు దివ్య దర్శనమిస్తున్నారు. అక్టోబర్ 22 (కార్తీకశుద్ధ పాడ్యమి) నుంచి నవంబర్ 20 (అమావాస్య) వరకు జరుగనున్న కార్తీక మాసోత్సవాలు భక్తులను ఆధ్యాత్మిక ఆవిష్కరణలో ముంచెత్తనున్నాయి.దేవస్థాన ప్రధాన అర్ధకులు దేవగిరి లక్ష్మన్న, అర్చకులు, సిబ్బంది శ్రద్ధతో ఏర్పాట్లు పూర్తి చేశారు. కార్యనిర్వహణాధికారి ఎస్. మోహన్బాబు తాలూకు పర్యవేక్షణలో కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరుగనున్నాయి.విశేష పూజా విశ్లేషణభక్తి, భౌతిక సాధనల కలయికగా రూపొందిన ఈ ఉత్సవాల్లో ప్రతి తేదీ ప్రత్యేకతను కలిగి ఉంది. 25 అక్టోబర్ నాడు నాగులచవితి విశేష పూజలు, 5 నవంబర్ బుధవారం కార్తీక పౌర్ణమి-గిరి ప్రదక్షిణ, గోపూజ, ధాత్రినారాయణ పూజ, లక్షదీపోత్సవం, జ్వాలాతోరణం, అఖండ జ్యోతి దర్శనం, సామూహిక సత్యనారాయణవ్రతాలు అశేష భక్తులను ఆకర్షించనున్నాయి. 8 నవంబర్ సంకష్టహర చతుర్ధి, 9 నవంబర్ ఆరుద్రోత్సవం, 18 నవంబర్ మాసశివరాత్రి-రుద్రాభిషేకం, కళ్యాణోత్సవం జరుగనున్నాయి. మాసం 20న అమావాస్యతో ఉత్సవాలు ముగుస్తాయి.పుణ్యమాసంలో పావన క్రతువులుకార్తీకమాసం హరి-హరుల ప్రీతి స్వీకార మాసంగా శాస్త్రగ్రంథాలు ప్రకటించాయి. ఈ సమయంలో శివాలయాల్లో పూజలు, విష్ణు స్తోత్రాలు, దీపారాధన చేయుట పుణ్యప్రదమని అర్చకులు వివరించారు. గోత్రనామాలతో అభిషేకం చేయించుకునే భక్తులు రూ. 2,016 చెల్లించి నమోదు చేసుకోవచ్చు. గోపూజ అత్యంత మహిమాన్వితం గోవులో బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు సహా ముప్పైమూడు కోట్ల దేవతలు నివసిస్తారని నమ్మకం. గో ప్రదక్షిణ చేయుట వలన భూప్రదక్షిణ ఫలితంలభిస్తుందని భావం. గోసంరక్షణ విరాళం రూ. 1,016, శాశ్వత నిత్యనివేదనకు రూ. 10,116గా నిర్ణయించారు.భక్తులలో ఆధ్యాత్మిక ఉత్సాహంకార్తీకపౌర్ణమినాడు చినుకు దీపం వెలిగించి అఖండ జ్యోతి దర్శనం చేసుకుంటే పూర్వజన్మలో చేసిన పాపాలు తీరిపోతాయని భక్తుల విశ్వాసం. ఆలయ ప్రాంగణం మొత్తం దేవదీపాల కాంతితో మెరుస్తోంది. గోపూజలు, రుద్రాభిషేకాలు, జ్యోతి దర్శనాలు భక్తులలో ఆధ్యాత్మిక ఆనందాన్ని నింపుతున్నాయి.

---



## రాజకీయ రణక్షేత్రంలో
# అక్షర సేనాని

### అక్షరమే ఆయుధంగా మందపురం సతీష్ ముందడుగు

### విద్యే ఆయుధం.. సేవయే మార్గంగా పయనం

**బెస్ట్ లెక్చరర్ నుంచి జన నాయకుడి వరకు.. ప్రజలు ఆశీర్వదిస్తే జెడ్పీటీసీ బరిలోకి..**



**స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబర్ 21 (తెలంగాణ వారధి ):** రాజకీయ బరిలో అడుగుపెడితే అది కేవలం గెలుపోటముల లెక్క కాదు.. అది ఒక సిద్ధాంత యుద్ధం. నిన్న తరగతి గదిలో గుణపాఠాలు చెప్పిన గురువు.. నేడు జన సమస్యల పరిష్కారం కోసం కలం పట్టాడు. నీతి, నిజాయితీలు ఆభరణములుగా కలిగిన వ్యక్తి మందపురం సతీష్. మట్టిలో పుట్టిన మాటల మాంత్రికుడు. ఇప్పగూడెం మట్టిలో పుట్టి పెరిగిన ఈ రైతు బిడ్డ.. తన విద్యా ప్రస్థానంలో అనేక మైలురాళ్లు అందుకున్నాడు. అనంతరం లెక్చరర్ గా తన ప్రయాణాన్ని మొదలెట్టాడు. పాలకుర్తి పోతన కాలేజీ నుండి హన్మకొండ తేజస్ జూనియర్ కాలేజీ వరకు విద్యార్థి లోకానికి ఆయన అందించిన ప్రతి అక్షరం ఒక మార్గజ్యోతి. ఆయన అందుకున్న బెస్ట్ లెక్చరర్ అవార్డు వేలాది విద్యార్థుల ప్రేమానురాగానికి ప్రతీక. అంతర్జాతీయ మోటివేషనల్ స్పీకర్‌గా ఆయన పలికే మాట, మనసు మలచే విద్యగా నిలుస్తుంది.

### మానవతా ప్రయాణానికి పునాది

2002లో నాడు విద్యాశాఖ మంత్రిగా ఉన్న కడియం శ్రీహరి హయాంలో, 2002 తర్వాత తాను డిగ్రీ చదువుకుంటూనే.. ఘనపూర్ మండలంలోని అనేక హోటళ్ళలో, భూస్వాముల వద్ద జీతం చేసుకుంటున్న 14 సంవత్సరాల లోపు బాలకర్మికులను చూసి బాధపడ్డాడు సతీష్. “బాల్యం పుస్తకంలో ఉండాలి.. పనిముట్లలో కాదు” అనే భావనతో ఆ పిల్లలను వెతికి, ఆర్బీసీ (రెసిడెన్షియల్ బ్రిడ్జ్ కోర్స్) కేంద్రాలలో చేర్పించి వారికి తానే గురువయ్యాడు. మూడు సంవత్సరాలు ఆ పాఠశాలకు ఇంచార్జ్‌గా పని చేస్తూ పది మంది పిల్లల జీవితాల్లో వెలుగు నింపిన ఘనత ఆయనదే. విద్య అనే ఆయుధంతో బాలకార్మికత్వంపై యుద్ధం చేసిన సాహస వీరుడు సతీష్.

### యుగపురుషుని ఆశయాల వారసుడు

ఆయన రాజకీయ ప్రయాణం అధికార కుర్చీ కోసం కాదు.. ఆదర్శాల కోసం. బాల్యంలో స్వయం సేవకుడిగా ఆర్ఎస్ఎస్ లో మొదలైన ఆత్మీయ సేవా మార్గం.. వందేమాతరం ఫౌండేషన్ స్థాపనతో సామాజిక ఉద్యమంగా మారింది. పేద విద్యార్థులకు ఉచితంగా మెటీరియల్ అందించడం, గ్రామీణ ప్రాంతాల్లో దాదాపు 180కి పైగా ఏకల్ విద్యాలయాలను నడిపించడం.. ఆయన సేవాస్ఫూర్తికి నిదర్శనం.



### కరోనా కష్టాల్లో ఆశాకిరణం

కరోనా కష్టకాలంలో సతీష్ చూపిన తెగువ అసమాన్యం. దాతల సాయం సమీకరించి పల్లెలకు ఆహారపొట్లాలు పంపించడం, పేద కుటుంబాలకు నిత్యావసర వస్తువులు అందించడం ఆయన నిత్య కృత్యంగా మారింది. ఇది ఏ స్వార్ధ రాజకీయాల కోసం ఆయన చేయలేదు. ప్రజలపై తనకున్న ప్రేమకు సజీవ సాక్ష్యం.

### జెడ్పీటీసీ బరిలో మార్పు శంఖారావం

బీజేపీలో మండల ప్రధాన కార్యదర్శిగా, కీలక ఎన్నికల ఇన్‌చార్జ్‌గా, ప్రైవేట్ లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఆయన ప్రజల కోసం ఎంతో పని చేశారు. వేలాది ఉపాధ్యాయుల హక్కుల కోసం పోరాడిన ఆయన.. గోపా యువజన విభాగానికి ఆధునిక దిశానిర్దేశం ఇచ్చాడు. ఇప్పుడు స్టేషన్‌ఘనపూర్ జెడ్పీటీసీగా బరిలో నిల్చేందుకు సతీష్ సిద్ధమవుతున్నాడు. ఇది కేవలం ఒక అభ్యర్థి కదలిక కాదు సామాజిక పరివర్తనకు సంకేతం. సతీష్ ప్రజల మనసులో సత్యం. ఆయన సేవా ప్రస్థానం అంతం కాదు. ప్రజల హృదయాల్లో మాత్రం ఆయన పేరు శాశ్వతం. విద్యతో ఆయుధం పట్టి, సేవతో ప్రస్థానం ఆరంభించిన సతీష్ గెలుపు.. ఘన్పూర్ నేలపై నిజాయితీ గెలుపు అవుతుందనడంలో ఏమాత్రం అతిశయోక్తి కాదు.





# రైతు కళ్లల్లో ఆనందమే లక్ష్యం

- రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం
- ప్రభుత్వ పథకాలను రైతులు అందిపుచ్చుకోవాలి
- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

**పాలకుర్తి, అక్టోబర్ 21 (తెలంగాణ వారధి):** రైతు కళ్ళల్లో ఆనందమే తన లక్ష్యమని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మంగళవారం నియోజకవర్గంలోని పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పుల మండల కేంద్రాల్లోని రైతు వేదికల్లో జాతీయ ఆహార భద్రత మరియు పోషణ మిషన్ (ప్యాడీ), జాతీయ నూనెగింజల మిషన్ (గ్రౌండ్‌నట్) కార్యక్రమాల్లో భాగంగా జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ షేక్ భాషాతో కలిసి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ..




రైతు దేశానికి వెన్నెముకని, రైతు బలంగా ఉంటేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందన్నారు. అందుకే ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా రైతులకు మద్దతుగా నిలుస్తోందన్నారు. ప్రభుత్వం అందించే పలు పథకాలను రైతులు అందిపుచ్చుకోవాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు, మద్దతు ధరలు, సాంకేతిక సాయం ద్వారా తమ వ్యవసాయాన్ని మరింత లాభదాయకంగా మార్చుకోవాలని సూచించారు. రైతులు పండించే ప్రతి గింజకు విలువ దక్కేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నాణ్యమైన విత్తనాల పంపిణీతో పాటు వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించడం ద్వారా దిగుబడులు పెంచడమే లక్ష్యమని తెలిపారు. రైతులకు అవసరమైన సహకారం అందించడానికి ఎల్లప్పుడూ తాను ముందుంటానని, రైతు కష్టానికి గౌరవం దక్కేలా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి ఏఎంసీ చైర్ పర్సన్ లావుడియా మంజుల భాస్కర్, కొడకండ్ల ఏఎంసీ వైస్ చైర్మన్ సాయి కృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గిరగాని కుమారస్వామి గౌడ్, పట్టణ అధ్యక్షులు నాగన్న, వ్యవసాయ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సొసైటీ సభ్యులు, రైతు సంఘాల ప్రతినిధులు భారీ సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## ఫలించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి కృషి

**పాలకుర్తి, అక్టోబర్ 21 (తెలంగాణ వారధి):** పాలకుర్తి నియోజకవర్గ రైతుల సంక్షేమమే ధ్యేయంగా స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి కృషి చేస్తున్నారు. ఇప్పటికే పాలకుర్తి, చెన్నూరు రిజర్వాయర్ల నిర్మాణ పూర్తి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ఎమ్మెల్యే.. తాజాగా రైతులు తాము పండించిన పంటను నిల్వ చేసుకోవడానికి పెద్ద గోదామ్ ను రైతుల కోసం మంజూరు చేయించారు. ఈ నేపథ్యంలో మంగళవారం దేవరుప్పుల మండలంలోని మన్ పహాడ్ లో గోదామ్ నిర్మాణం కోసం అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పండించిన పంట విషయంలో రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకూడదన్నారు. పంట చేతికొచ్చాక నిల్వ సదుపాయం లేక రైతులు నష్టపోతున్నారని, ఈ గోదామ్ నిర్మాణం పూర్తయితే రైతులు తమ ధాన్యాన్ని సురక్షితంగా నిల్వ చేసి తగిన సమయంలో మంచి ధరకు విక్రయించుకోవచ్చన్నారు. ఇది రైతుల ఆదాయాన్ని పెంచి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తుందన్నారు. కాగా గోదామ్ మంజూరిపై స్థానిక రైతులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.



# ఘనంగా దీపావళి సంబురాలు

### సుధా టెక్నో స్కూల్‌లో కేదారేశ్వర వ్రతం

**పాలకుర్తి, అక్టోబర్ 21(తెలంగాణ వారాది ) :** దీపాల పండుగ దీపావళి తో పాటు జరుపుకునే కేదారేశ్వర వ్రతం లేదా కేదారి గౌరీ వ్రతం పురస్కరించుకొని సుధా టెక్నో స్కూల్‌లో ఆధ్యాత్మికత, ఆనందం కలగలసిన వాతావరణంలో వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు తమ సృజనాత్మకతను ప్రతిబింబిస్తూ పాఠశాల ప్రాంగణాన్ని వెలుగులతో ముస్తాబు చేశారు. భక్తి గీతాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, దీపాల హారతులతో పాఠశాల అంతా ప్రకాశవంతమైంది. ఉపాధ్యాయులు ఈ సందర్భంగా దీపావళి యొక్క ఆధ్యాత్మికతను వివరిస్తూ, “దీపం వెలిగించడం అనేది చీకటిని పారద్రోలడమే కాదు, మన మనసులోని అజ్ఞానాన్ని తొలగించి, జ్ఞానదీపం వెలిగించుకోవడం” అని విద్యార్థులకు సందేశమిచ్చారు. యాజమాన్యం మాట్లాడుతూ – “ఈ దీపావళి అందరి జీవితాల్లో కొత్త కాంతులు, కొత్త ఆశలు, విజయాలు నింపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం” అని తెలిపారు. సుధా టెక్నో స్కూల్ కుటుంబం సమిష్టిగా పాల్గొన్న ఈ పండుగలో విద్యార్థుల ఉత్సాహం, ఉపాధ్యాయుల ప్రోత్సాహం, యాజమాన్య ఆధ్యాత్మిక దృక్పథం కలగలసి అద్భుతమైన వాతావరణాన్ని సృష్టించాయి. “జ్ఞానదీపాలు వెలిగినంత కాలం మన హృదయాలు ప్రేమ, కరుణ, సామరస్యంతో నిండాలని” అని అందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

# టీపీసీసీ చీఫ్‌తో ఝాన్సీరెడ్డి భేటీ



హైదరాబాద్, అక్టోబర్ 21 (తెలంగాణ వారధి) : విదేశీ పర్యటన అనంతరం నగరానికి చేరుకున్న టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రాజేందర్ రెడ్డి టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇద్దరి మధ్య రాష్ట్రంలో పార్టీ బలోపేతం, రాబోయే కార్యక్రమాల రూపరేఖలు, కార్యకర్తల సమన్వయంపై విశదంగా చర్చ జరిగింది. ఝాన్సీ రాజేందర్ రెడ్డి, పార్టీ అధినేత పట్ల గౌరవాన్ని వ్యక్తం చేస్తూ, ఆయన నాయకత్వంలో కాంగ్రెస్ మరింత శక్తివంతంగా ముందుకు సాగుతుందనే నమ్మకం వ్యక్తం చేశారు. మహేష్‌కుమార్ కూడా ఝాన్సీ రాజేందర్ రెడ్డి కృషిని అభినందిస్తూ, పార్టీ అభివృద్ధికి అందరూ ఏకముగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ ఆత్మ, సిద్ధాంతాల పట్ల అంకితభావంతో పనిచేయాలంటూ ఆమెకు సూచించారు. ఈ భేటీ సత్సంబంధాల వాతావరణంలో స్నేహపూర్వకంగా సాగింది.

# ఝాన్సీ రాజేందర్ రెడ్డిని కలిసిన పాలకుర్తి కాంగ్రెస్ నేతలు

### దీపావళి శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

**పాలకుర్తి, అక్టోబర్ 21(తెలంగాణ వారధి) :** విదేశీ పర్యటనను విజయవంతంగా ముగించుకుని స్వదేశానికి తిరిగి వచ్చిన తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రాజేందర్ రెడ్డి ని పాలకుర్తి క్యాంప్ ఆఫీసులో మర్యాదపూర్వకంగా కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో కొడకండ్ల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ, తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు హామ్యనాయక్, పాలకుర్తి మండల కాంగ్రెస్ అధ్యక్షులు కుమారస్వామి గౌడ్, పాలకుర్తి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ధరావత్ రాజేష్ నాయక్, యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ లోడంగి అశోక్, మాజీ ఎంపీపీలు యాకసోమయ్య, శ్రీనివాస్, మాజీ కోఆప్షన్ మెంబర్ ఎండీ మదార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు భాస్కర్, అశోక్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.నేతలందరూ దీపావళి శుభాకాంక్షలు పరస్పర అభినందనలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు మహిళా, యువత ప్రజా సమస్యలపై చర్చలు జరిపారు. భవిష్యత్తులో నియోజకవర్గ అభివృద్ధికి మరిన్ని కార్యాచరణలు చేపడతామని నేతలు ప్రత్యేకంగా పేర్కొన్నారు.



# దేవరుప్పులలో అన్నప్రసాద వితరణ



**దేవరుప్పుల, (తెలంగాణ వారధి ) :** అమావాస్య పుణ్యక్షణంలో ఆహారదానం అనే మహాదానాన్ని ఆచరించిన ఆర్యవైశ్య సంఘం నిజమైన మానవత్వానికి నిదర్శనంగా నిలిచింది. దేవరుప్పుల మండల కేంద్రంలో మంగళవారం జరిగిన అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఆధ్యాత్మికతతో, సేవాభావంతో కళకళలాడింది. మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఇరుకుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వందలాది మంది భక్తులు, సేవకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ “అన్ని దానాల్లో అన్నదానం అగ్రగణ్యమైనది. ఇది కేవలం ఆహారం ఇవ్వడం కాదు, ప్రేమను, మానవత్వాన్ని పంచడం. అన్నదానం ద్వారా ఇతరుల కడుపు నింపితే, మన హృదయం సంతృప్తి చెందుతుంది. స్వీకరించిన వారి ఆశీర్వాదాలు మన జీవితంలో సానుకూల మార్పులు తీసుకువస్తాయి” అన్నారు. ప్రతి నెల అమావాస్య రోజు దేవరుప్పుల మండల కేంద్రంలో ఈ సేవా కార్యక్రమాన్ని కొనసాగిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు, యువసభ్యులు, భక్తులు పాల్గొని పుణ్యఫలాన్ని పొందారు.